క్లుప్తంగా

నేడు ఎలుకల నిర్మూలన కార్యక్రమం

బిక్కవోలు: మండలంలో శనివారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారి కొవ్వూరి మల్లికార్జున భాస్కర్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు ఉచితంగా ఎలుకల మందు పంపిణీ చేస్తామన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



పందలపాకలో జరుగుతున్న అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

బిక్కవోలు: సంక్రాంతిని పురస్కరించుకుని పందలపాకలో శుక్రవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారిని ఆశీనులు చేసి ఊరేగించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు తుమ్మూరి వెంకట రమణ, గురజాపు అన్నవరం స్వామి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు కిశోరి వికాసంపై శిక్షణ

బిక్కవోలు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై శనివారం శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలన, బాలికల సాధికారత కోసం కిషోరి వికాసం కమిటీ ఏర్పాటు చేశారన్నారు. గ్రామ స్థాయిలోని మహిళా గ్రామ సర్పంచి, మహిళా వార్డు సభ్యులు, మహిళా పంచాయతీ కార్యదర్శి, అంగనవాడీ కార్యకర్త, పాఠశాల ఉపాధ్యాయురాలు, ఏఎన్ఎం, డ్వాక్రా వీఓఏ మెంబర్, మహిళ పోలీసుతో కమిటీలను ఏర్పాటు చేశారన్నారు. వీరికి మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ అందిస్తారని, సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

మధురపూడి: కోరుకొండ సబ్ స్టేషన్ పరిధిలో 33/11 కేవీ కేవీ ఫీడర్ వార్షిక మరమ్మతులు, చెట్లకొమ్మల కత్తిరింపు కోసం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కోరుకొండ మండలంలోని రాఘవపురం, కోటి కేశవరం, బొల్లెద్దుపాలెం, నాగంపల్లి గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

ఘనంగా పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ

పెదపూడి: సంపర గ్రామంలో కొలువైన విజయదుర్గమ్మకు శుక్రవారం పంచామృతాభిషేకం చేశారు. అలాగే కుంకుమ పూజలు జరిపారు. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో చీర కట్టి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు భక్తులతో లలిత, విష్ణు సహస్ర పారాయణ చేయించారు.

విజయదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



రంగంపేటలో కొలువైన విజయదుర్గమ్మ

రంగంపేట: గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద ఉన్న విజయ దుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చంద్రేడు గ్రామంలోని శ్రీదేవి కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

మోతాదు మించితే అనర్థమే

- ఎరువుల వినియోగంపై అవగాహన అవసరం
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు
- ఇప్పటికే 95 శాతం వరినాట్లు పూర్తి



పందలపాకలో ఎరువులను కలుపుతున్న రైతులు

బిక్కవోలు: దాళ్వా వరి సాగు ముమ్మరంగా జరుగుతోంది. ముందుగా నాట్లు వేసిన రైతులు ఎరువులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో సుమారు 52 వేల ఎకరాలల్లో దాళ్వా వరి నాట్లు వేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ దాదాపు 95 శాతానికి పైగా పూర్తయినట్లు అంచనా. పంటల దిగుబడిని పెంచడంతో ఎరువుల పాత్ర చాలా కీలకం. అయితే రసాయన ఎరువుల వినియోగంపై పూర్తి అవగాహన లేకపోవడం, పరిసర ప్రాంత రైతుల మధ్య నెలకొన్న పోటీతత్వం కారణంగా అవసరానికి మించి విచక్షణా రహితంగా ఎరువులు వాడుతున్నారు. దీనితో సాగు ఖర్చులు పెరిగిపోవడంతో పాటు చీడపీడలు విజృంభిస్తున్నాయి. జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషక లోపాలు ఎక్కువ కావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

పరిమితంగా వాడితేనే మంచిది

ఎకరం విస్తీర్ణంలో వరికి మొదటి దఫా సిఫారసు చేసిన మొత్తం భాస్వరాన్ని దమ్ములో వేసుకోవడం వల్ల త్వరగా మూన తిరిగి దుబ్బు ఎక్కువగా చేస్తుంది. నత్రజని ఎరువును మూడు సమ భాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలోనూ, రెండో దఫా పిలకలు కట్టే దశలోనూ, చివరి దఫా అంకురం దశలోనూ వేసుకోవాలి. పొటాష్ ఎరువును రెండు భాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలో, మిగిలిన సగం అంకురం ఏర్పడే దశలోనూ వేసుకోవాలి. సూటి ఎరువుల రూపంలో ఎకరాకు 157 కిలోల యూరియా, 200 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అవసరమవుతాయి.

నత్రజని వినియోగం

నత్రజని ఎరువు సమర్థంగా పనిచేయాలంటే చేనులో బురద పదునుపై చల్లి 48 గంటల తరువాత నీరు పెట్టాలి. 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి లేదా 2.50 కిలోల తేమ కలిగిన మట్టి కలిపి, రెండు రోజులు నిల్వ ఉంచిన తర్వాత పొలంలో చల్లుకోవాలి. దీని వల్ల మొక్క బాగా పెరుగుతుంది.

పైరులో సూక్ష్మ పోషక లోపాలు

జింక్ లోపం వల్ల నాట్లు వేసిన తర్వాత మొక్కపై నుంచి 3 లేదా 4 ఆకుల మధ్య ఈనె తెల్లగా పాలిపోతుంది. మధ్య ఈనె ముందుగా ఆకు పచ్చ నుంచి పసుపు రంగుకు, తరువాత తెలుపు రంగుకు మారుతుంది. జింక్ లోపం ఆశించిన ఆకులు చిన్నవిగా, పెలుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. జింక్ లోపం నివారణకు నాట్లు వేసిన 2 నుంచి 5 వారాల మధ్య పొలంలో ఉన్న నీటిని తీసివేసి కొత్తగా పెట్టాలి. లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పైరు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి. ఐదు రోజుల వ్యవధిలో రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేయడం వల్ల లోపాన్ని పూర్తిగా నివారించవచ్చు.

ఇనుప ధాతు లోపం

ఇనుప ధాతు లోపం సాధారణంగా సున్నం ఎక్కువగా ఉండే నేలలు, మెట్ట నారుమడులు వేసే ప్రాంతాలు, అధిక వర్షాలు కురిసిన తరువాత నీరు నిలిచిన పొలాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఆకుల ఈనెల మధ్య భాగం పసుపు రంగుకు మారి క్రమేపీ ఆకు అంతా తెల్లగా తయారై ఎండి పోతుంది. దీని నివారణకు లీటర్ నీటికి 20 గ్రాముల అన్నభేది, రెండు గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి రెండు, మూడు పర్యాయాలు పిచికారీ చేయాలి.

అతిగా వాడితే నష్టం



దాళ్వా పంటలో అధిక దిగుబడి సాధించాలని కొందరు రైతులు ఎరువులను ఎక్కువగా వినియోగిస్తారు. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం కలుగదు. పైగా ఎరువుల అధిక వినియోగంతో ఖర్చు ఎక్కువవుతుంది. చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ప్రతి గ్రామంలోనూ వ్యవసాయ సలహాదారులు ఉన్నారు. వారి సూచనల ప్రకారం ఎరువులను వినియోగించాలి.

– శామ్యూల్ జాన్, వ్యవసాయధికారి, బిక్కవోలు

క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పందలపాక



విజేతలకు ట్రోఫీ, నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం ఏపీ ఎస్ఆర్‌డబ్ల్యూఎస్ జూనియర్ కాలేజీలో సోము యువసేన ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా మణికంఠరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో బిక్కవోలు మండలం పందలపాక జట్టు విజేతగా నిలిచింది. ఈ నేపథ్యంలో ఆ జట్టుకు ట్రోఫీ రూ.25 వేలు, రన్నర్‌గా నిలిచిన లక్ష్మీనరసాపురం జట్టుకు ట్రోఫీ, రూ.15 వేలను అందజేశారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన బాలిక కనిపించడం లేదని తల్లి (కర్రి సోమేశ్వరి) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ శుక్రవారం తెలిపారు. తెల్లవారుజాము 4 గంటలకు తల్లిదండ్రులు చూడగా ఇంటిలో బాలిక కనిపించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆనాటి స్నేహం.. నేటికీ పదిలం



కార్యక్రమానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

- జి.మామిడాడలో ఆత్మీయ సమ్మేళనం
- 40 ఏళ్లకు కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1980–85 వరకూ ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు శుక్రవారం స్థానిక ఏఆర్‌సీ కల్యాణ మంటపంలో కలుసుకున్నారు. పదో తరగతి చదివి 40 ఏళ్లు పూర్తి చేసిన సందర్భంగా ఈ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆత్మీయ సమ్మేళనం నిర్వహణకు కృషి చేసిన తమ తోటి విద్యార్థులను అభినందించారు. అలాగే అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ పాఠశాల్లో 210 మంది విద్యార్థులు చదువుకున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో ఒకరికొకరు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కుటుంబాల సమేతంగా తరలిరావడంతో సందడి నెలకొంది. ఈ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సహకారం అందిస్తామని, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పలు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వైభవంగా హరిద్ర జలాభిషేకం



బిందెలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

బిక్కవోలు: గ్రామంలోని జవ్వలదొడ్డిలో కొలువైన సత్తెమ్మ తల్లి జాతర సందర్భంగా శుక్రవారం 108 బిందెల గోదావరి నీటితో హరిద్ర జలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ముందుగా గోదావరి జలాలతో గ్రామోత్సవం చేసి, అనంతరం అమ్మవారికి అభిషేకం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 18న జాతర, 19న అమ్మవారి తీర్థం, 26న అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. కాగా.. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీరామపురం వీఆర్వో మృతి



దారా శ్రీరామ్మూర్తి (ఫైల్)

రాజానగరం: మండలంలోని శ్రీరామపురంలో వీఆర్వోగా పనిచేస్తున్న దారా శ్రీరామ్మూర్తి అనే చంటి (47) గురువారం అర్ధరాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. భోగి పండగ రోజు విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యానికి గురవడంతో అతడిని రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. బ్రెయిన్ స్ట్రోక్‌గా గుర్తించిన వైద్యులు, సర్జరీ చేసి, వైద్య సేవలు అందిస్తుండగా మృతి చెందాడు. అతడికి భార్య, బీటెక్, డిగ్రీ చదువుతున్న కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతడి స్వగ్రామమైన రంపయర్రంపాలెంలో శుక్రవారం అంత్యక్రియలు జరిగాయి. తహసీల్దారు జీఎల్ సత్యవతీదేవి, మండలంలోని వీఆర్వోలు అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పంచాయతీ భవనం ముందు ఫ్లెక్సీల ఏర్పాటు



రాపాక పంచాయతీ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

సీతానగరం: మండలంలోని రాపాక పంచాయతీ కార్యాలయం ముందు కూటమి నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో కార్యాలయం కనిపించకుండా పోతోంది. నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు పంచాయతీ కార్యాలయం ముందు భారీ ఫ్లెక్సీలు ఉంచారు. వీటికి అనుమతి ఉందా, అనధికారికంగా ఏర్పాటు చేశారా అనే విషయంపై స్పష్టత లేదు. ఇటీవల పంచాయతీ సర్పంచ్ మృతి చెందారు. దానితో పంచాయతీ కార్యాలయంపై అజమాయిషీ లేకుండా పోయింది. ఈ విషయంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఖైదీల కేసుల దర్యాప్తుపై సూచనలు



సమావేశంలో పాల్గొన్న జిల్లా న్యాయమూర్తి శివ కుమార్ తదితరులు

కంబాలచెరువు: విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు చేసే విధానంపై పోలీసు అధికారులకు జిల్లా ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివకుమార్ పలు సూచనలు చేశారు. ఈ మేరకు జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం అండర్ ట్రయిల్ రివ్యూ, ఎగ్జిక్యూటివ్ కమిటీల సమావేశాలు నిర్వహించారు. బెయిల్, జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించి, సంబంధిత అధికారులకు సిఫారసులు చేశారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు, ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్ కె.జానీబాషా, జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలను కాపాడిన హెల్మెట్



ప్రమాద స్థలంలో ట్రాలీ, బైక్


రాజానగరం: అతి వేగం అనర్థదాయకమనే విషయం అందరికీ తెలిసిందే. అయినా ఎవ్వరూ పెద్దగా పట్టించుకోరు. అందుకనే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు అతి వేగం కారణంగానే జరుగుతుంటాయి. ఈ క్రమంలోనే దివాన్‌చెరువులో శుక్రవారం జరిగిన ఒక ప్రమాదంలో బైకు నడుపుతున్న వ్యక్తి ప్రాణాలను హెల్మెట్ కాపాడింది. వివరాల్లోకి వెళితే.. ధవళేశ్వరానికి చెందిన కె.ప్రేమ్‌కుమార్ మోటారు బైక్‌పై కాకినాడ వెళ్లి తిరిగి వస్తూ దివాన్ చెరువు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. బైకుపై అతివేగంగా వస్తున్న అతడు రోడ్డు పక్కన ఆగి వున్న ట్రాలీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఆ సమయంలో అతడి తలకు హెల్మెట్ ఉండటంతో ప్రాణాలు నిలిచాయి. ఆ వేగానికి ముక్కుకు, నోటికి మాత్రం తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని హైవే పోలీసులు 108 వాహనంలో చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసును బొమ్మూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో నిందితుడికి ఏడాది జైలు

కంబాలచెరువు: గంజాయి కేసులో నిందితుడికి ఏడాది జైలు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ ఒకటో ఏజేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ ఎం.జగదీశ్వరి శుక్రవారం తీర్పు చెప్పారు. 2019 నవంబర్ 16న అన్నపూర్ణమ్మపేటలో ఆటో డ్రైవర్ బొంతు ప్రసాద్ వద్ద నుంచి అప్పటి వన్‌టౌన్ ఎస్సై పీవీ త్రినాథ్ 200 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టు ముందు నిందితుడిని హాజరుపరిచారు. ఒకటో ఏజేఎఫ్‌సీఎం కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీవిద్య ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. విచారణ అనంతరం మేజిస్ట్రేట్ పైవిధంగా తీర్పు చెప్పారు.

అరటి తోట.. లాభాల బాట

- సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు
- జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి




కోతదశకు వచ్చిన అరటి తోట

రంగంపేట: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో అరటికి ప్రత్యేక స్థానం ఉంది. అది లేనిదే ఏ శుభకార్యం ఉండదనే చెప్పవచ్చు. అంతేకాక నిత్య జీవితంలోను అరటి ఒక భాగమైపోయింది. అరటి పండుకు ఉన్న ఆహార, ఆరోగ్య విలువల వల్ల దాన్ని అమృత ఫలం, కల్పతరువు అంటారు. ప్రతి రోజూ ఒక అరటి పండు తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు తెలుపుతున్నారు. ఇన్ని ప్రయోజనాలు ఉన్న అరటికి మంచి డిమాండ్ ఉండటంతో మండల రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. రంగంపేట మండలంలో నేల అరటి సాగుకు అనుకూలంగా ఉంటుదని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఇక్కడి రైతులు అరటి తోటల పెంపకం పై మక్కువ చూపుతున్నారు.

అనుకూలమైన నేలలు

నీరు ఇంకి పోవు గుణం కలిగిన సారవంతమైన నేలలు అరటికి అనుకూలంగా ఉంటాయి. ఉదజని సూచిక 6.5 నుంచి 7.5 ఉన్న భూములు చాలా బాగుంటాయి. అరటి ఉష్ణ మండల పంట. 10 డిగ్రీల నుంచి 40 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వరకు మంచి దిగుబడి వస్తుంది. అధిక చౌడు, అమ్ల శాతం ఉన్న భూమిలో పనామా–మాడు తెగులు వచ్చే అవకాశం ఉంటుంది.



రంగంపేట మండలంలో సాగు చేస్తున్న అరటి మొక్కతోట

టిష్యూ కల్చర్ మొక్కలు

టిష్యూ కల్చర్ ద్వారా ప్రవర్తనం జరిపిన అరటి మొక్కలను రైతులు నాటాలని అధికారులు సూచిస్తున్నారు. తెగుళ్లు లేకుండా అధిక దిగుబడి, నాణ్యత కలిగిన తల్లి మొక్క నుంచి కణజాలాన్ని సేకరించి ప్రయోగశాలలో అవసరమైన వెలుతురు, గాలిలో తేమ, ఉష్ణోగ్రత లాంటి పరిస్థితులు కల్పించి కణజాలం నుంచి పిల్ల మొక్కలను ఉత్పత్తి చేసే ప్రక్రియనే టిష్యూ కల్చర్ అంటారు. వీటికి ముఖ్యంగా వైరస్ తెగుళ్లు, నులిపురుగులు ఆశించే అవకాశం ఉండదు.

మొక్కలు నాటే విధానం

అరటి తోటలో ఎకరానికి 1,235 నుంచి 1,280 మొక్కలు నాటాలి. గుంత నుంచి వచ్చిన మట్టికి ఐదు కిలోల పశువుల ఎరువు, అర కిలో వేపపిండి, 300 గ్రాముల సూపర్ ఫాస్ఫేట్ ఎరువు, 30 గ్రాముల లిండెన్ పొడి మందు చేర్చి బాగా కలియబెట్టి గుంత నింపి అనంతరం మొక్కను నాటాలి.

అంతర పంటలు

అరటి తోట అంతర పంటలకు అనుకూలంగా ఉంటుంది. వేరు శనగ, అలసంద, పసుపు, అల్లం, ఉల్లి, వెల్లుల్లి, అనాస, ఆకు కూరలు, క్యారెట్, కాలీఫ్లవర్, క్యాబేజీ తదితర వాటిని అరటిలో అంతర పంటగా వేసుకోవచ్చు. దీర్ఘకాలిక పంటలైన మామిడి తోటల్లోనూ అరటిని సాగు చేస్తే తకువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు. అయితే అంతర పంటలకు అరటితో సంబంధం లేకుండా ఎరువులు అదనంగా ఇవ్వాలి. అరటి సాగుకు ఎక్కువగా నీరు అవసరం. కానీ నీరు ఎక్కువ నిల్వ ఉండరాదు కాబట్టి రైతులు డ్రిప్ పద్ధతిలో నీరు కట్టడం ఉత్తమం. ఫర్టిగేషన్ పద్ధతిలో ఎరువులు వేస్తే అరటి చెట్లు అధిక దిగుబడులు ఇస్తాయి.

అంతర కృషి ముఖ్యం

అరటి తల్లి చెట్టుకు సరైన పోషకాలు అందుబాటులో ఉంచడం, బలంగా ఉంచడానికి అంతర కృషి చాలా ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇందుకోసం అరటి పిలకలు తల్లి చెట్టుతో పాటు ఎదిగినట్‌లైతే అవి తల్లి చెట్టుకి పోషక పదార్థాల లోపాలను కలగజేస్తాయి. కాబట్టి చిన్నవిగా ఉన్నప్పుడే పిలకలను తొలగించాలి. అరటి చెట్లు రకాన్ని బట్టి 10 అడుగుల కన్నా ఎత్తయినప్పుడు పూతకు వచ్చి గెల వేసిన తరువాత బరువుకు చెట్టు పడకుండా కర్రల ద్వారా ఊతం అందించాలి. గెల వేసిన తరువాత ఆఖరి హస్తం విడిచిన 3–4 రోజుల తరువాత గెల చివరన ఉంటే మగ పువ్వుని తుంచి వేయాలి. బన్స్ ఫీడింగ్ మిశ్రమం (ఆవుపేడ, ఆవు మూత్రం, మల్టీకే)ను మగ పువ్వుని తుంచిన తరువాత పాలీకవర్‌లో పెట్టి గెలకు కట్టాలి.

సస్యరక్షణ చర్యలు

- కాండం తొలుచు పురుగు నివారణకు పూత రాక ముందు మోనోక్రోటోఫాస్ ఇంజక్షన్ ఇవ్వాలి.
- అలాగే ముక్కు పురుగు దుంపలో వలయాకారపు బొరియలు వేసి దుంప కుళ్లిపోయేలా చేస్తుంది. దీని నివారణకు ఒక్కో మొక్కకు 25 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలను చెట్టు మొదళ్లలో వేసి మట్టితో కప్పి నీరు పెట్టాలి.
- నులిపురుగులు చెట్టు వేళ్లను ఆశించి దుంప బలహీన పడి ఆకులు నల్లగా మాడి ఎండిపోతుంది. దీని నివారణకు వేపపిండి 200 గ్రాములు, 100 గ్రాముల వీఏఎం కలిపి ఒక్కో మొక్కకు వేయాలి.
- ఆకులపై మొట్ట మొదట చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడి క్రమేపీ వివిధ దశల్లో ఆకులు పూర్తిగా రాలిపోతాయి. దీని నివారణకు మాంకోజెట్ 2.5 గ్రాములు, క్లోరోథాలోనిల్ 2 గ్రాములు ఒక్క లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పేనుబంక వల్ల వైరస్ తెగుళ్లు ఆశించి మొక్కల్లో పెరుగుదల ఆగకుండా నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు ఒక్క లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.



ఆశాజనకంగా ఉన్న అరటి గెల

మెళకువలు ముఖ్యం



అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో 22 ఎకరాలలోను, రాజానగరం నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో 163 హెక్టార్లలో అరటి సాగు చేస్తారు. రైతులు అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చు. అరటి సాగుకు వేసవిలో లోతుగా దుక్కి చేసి బాగా ఎండ బెట్టిన భూమిలో అరటి వేయాలి. పంట మార్పిడి చేయాలి. బంతి పంటను పండించిన తరువాత అరటిని నాటాలి. డ్రిప్ పద్ధతిలో సాగు చేయడం ఉత్తమం.

– కె. దివ్యశ్రీ, ఉద్యానశాఖాధికారి, రంగంపేట మండలం